# బుద్ధిమంతుడు

టేబిల్ మీది ఫైల్స్ పక్కకి నెట్టి, కుర్చీలో జారబడి, సిగరెట్ పేకట్ తెరవబోయాడు గోపాలరావు.

అతని చెయ్యి సగం దారిలో ఆగిపోయింది.

కళ్ళు గోడమీది ఎలక్ట్రిక్ గడియారంమీదికి వెళ్ళేయి—ఇంకా పదినిమిషాల తరువాతగాని రెండో సిగరెట్ కాల్చడానికి వీల్లేదు. శ్రీమతితో అయిన ఒప్పందం ప్రకారం. "మీ ఆరోగ్యం కోసమే అలాగు" అంది శ్రీమతి. "డబ్బుకోసం కాదు" అంది శ్రీమతి–రెండు నెలల కిందట న్యూస్‌పేపర్ కొనడం మానేస్తూనూ అలాగే అంది శ్రీమతి. "ఆఫీసులో ఎలాగ చూస్తారుగదా! కళ్ళకు మంచిదికాదు అంత చదవడం" అంది శ్రీమతి. వాళ్ళ నాన్నగారికి మూడు లక్షల ఆస్తి ముగ్గురు అమ్మాయిలూను. శ్రీమతి అందరికన్నా చిన్నది. ఆయన చాలా పెద్దవాడు అంచేతా, అందరికీ చెప్పకూడని ఇతర కారణాలవల్లా శ్రీమతి ఏది చెపితే అది మంచిది. అది విధి. అది న్యాయం.

పది నిమిషాలు రెండు నిమిషాల్లా గడిచిపోతే బాగుండుననిపించిం దతనికి–అవతల ఇంటర్వ్యూకి కేండిడేట్లు కూర్చుని (లేక నిలబడి, లేక పచార్లు చేస్తూ) ఉన్నారు. సిగరెట్‌కోసం

ప్రాణం తహతహ లాడినప్పుడు భాష ఇలాగే ఉంటుంది. గోపాలరావుకి వెంటనే మొదటి కేండిడేట్‌ని పిలిస్తే మధ్యలో తాను సిగరెట్ వెలిగించాలి. అది డిసిప్లిన్‌కి విరుద్ధమా కాదా? శ్రీమతి ఏమంటుంది ? డైరెక్టరు ఏమంటాడు ?

శ్రీమతి చాలా అంటుంది. డిసిప్లిన్ కోసంకాదు—సిగరెట్ కోసం.

డైరెక్టరు ఏమీ అనడు. డిసిప్లిన్ కోసం.

తరవాత సిగరెట్‌కి ఇంకా ఎనిమిది నిమిషాల ముప్పై సెకండ్లు.

రేడియోవాళ్ల తరవాతి కార్యక్రమంలాగ కాదు, రేడియోలో తరువాతి కార్యక్రమం 'కొద్దిక్షణాలలో' ప్రారంభం అవుతుంది. లేదా, 'వెంటనే' ప్రారంభమవుతుంది.

జీవితం రేడియోలాగ ఉంటే?

అప్పుడు రేడియో జీవితం లాగ ఉంటుందా?

ఏమోలెద్దూ! ఎందుకొచ్చిన గొడవ ?

ఒక కేండిడేటుని పిలిచి ఎనిమిది నిమిషాల్లో పంపివేస్తే? 'తరువాతి' కాండిడేటు వెంటనే ప్రత్యక్షం కాకుండా చేస్తే?

గోపాలరావు ప్యూన్‌కోసం, గంటకోసం, వెదికి బెల్ బటన్ నొక్కాడు.

ప్యూన్ ఆలస్యంచేసి వచ్చాడు. సరిగ్గా ముప్పై ఆరు సెకండ్లు. సోలాంగ్! బీడీకాలుస్తూ ఉండివుంటాడు.

"ఒకటో కాండిడేటు..."

"పేరు సార్?"

ఫోల్డర్‌లో చూసి పేరు చెప్పేడు.

ప్యూను వెళ్ళి ఒకటో కాండిడేటు వొచ్చేడు-వొచ్చింది.

కొంచెం నల్లగా ఉంది.

ముదురురంగు చీర కట్టుకుంది.

చీర అతిపలుచగా ఉంది.

బ్లౌజు మరీ క్లుప్తంగా ఉంది.

తలకి చాలా నూనె రాసివుంది.

ఆమె తనకి గోపాలరావుకి నమస్కరించలేదు.

ముఖానికి చాలా పౌడర్ ! టూమచ్.

"మీ పేరు?"

"ప్రియంవద"

గొంతుక బాగులేదు, పేరు బాగుంది. ఎప్పుడో ఎవరో ఆమెని కట్టుకుంటే, ప్రియా! ప్రియా! అని పిలవచ్చు. ఇద్దరూ ఆనందించవచ్చు. ప్రొద్దుటి రేడియోలో వొచ్చింది, హిందీ పాట-ప్రియా ప్రియా-అంటూ. శ్రీమతి రేడియో కట్టేసే దాకా విన్నాడు తాను. "గోలలెద్దురు" అంది శ్రీమతి. "డబ్బు కోసం కాదు" అనలేదు శ్రీమతి. అనక పోతేనేం? తనకి తెలుసు.

"ఏం చదువు కున్నారు?"

ఆమె ముఖం అందంగా లేదు.

బి. ఏ. ఒక సంవత్సరం చదివి మానినట్టు ఫోల్డర్ కాగితం చెప్తోంది.

"బి. ఏ. దాకా..."

"ఎందుకు మానేశారు?"

"కుదరక..."

ఎందుకు కుదరలేదు ?

ఆర్థిక కారణాలా ? అంటే వాళ్ల నాన్నగారికి డబ్బుల్లేవా?

సాంఘికమా ? అంటే ఆమె రోడ్డుమీద నడచి కాలేజీకి వెడుతుంటే అందరూ, అంటే యువకులు "ప్రియా! కృష్ణప్రియా! నల్లప్రియా! ఏమి కథ ? చెయ్యకు వధ!" అని ఆమెని ఏడిపించారా?

రాజకీయ, సాంకేతిక కారణాలా?

అవేవో అతనికి తెలియలేదు.

ఇంకా మూడు నిమిషాలున్నాయి-తనకీ, తరువాతి సిగరెట్ కీ మధ్య. గాడ్! అనంతమైన నిమిషాలు.

తనకీ ప్రియంవదకీ మధ్య మూడడుగుల మూడంగుళాలు, తనకి తెలుసును. నలభై కి బదులు ముప్పై తొమ్మిదంగుళాలు వెడల్పు పెట్టేడు కంట్రాక్టరు.

"లైపు వొచ్చునా?"

"వొచ్చును."

"స్పీడెంత ?"

"నలభై ...నలభై అయిదు..."

"షార్ట్ హేండ్?"

"సీనియర్..."

"ఇంగ్లీషు వచ్చునా?"

"ఇంటర్మీ—"

"అదిసరే. తెలుగు మీడియమ్‌తో చదివారు—"

"అవును"

"ఇంగ్లీషు వచ్చునా?"

"కొద్దికొద్దిగా"

డౌన్ విత్ ఇంగ్లీష్ అని పట్టణం నిండా గోడలమీద రాసిన స్లోగన్లు గోపాలరావుకి జ్ఞాపకం వొచ్చాయి. ఇంగ్లీషు రాని ఈ అమ్మాయి ఎలాగ పని చెయ్యగలదు? డైరెక్టరుకి ఇంగ్లీషు తప్ప మరో భాషలో మాట్లాడే అలవాటు లేదు. ఆయన మాతృభాష పంజాబీ.

"ఈ ఉద్యోగంకోసం ఎందుకు అప్లై చేశారు?" అని ఇంగ్లీషులో అడిగాడు గోపాలరావు. ఇది బ్రహ్మాస్త్రం. ప్రియంవద నిమిషంపాటు మాట్లాడలేదు.

తరువాతి సిగరెట్‌కి ఇంకా రెండు నిమిషాలు.

"ఐ..."

అతనికి తెలుసు.

"ఐ వాంట్"

అదీ తెలుసును.

జాబ్. మనీ. యస్. యస్. యస్.

"థాంక్యూ. సెలవు..."

ప్రియంవద కదల్లేదు. నలభై సెకండ్లు మాత్రమే. ఆమె కదిలేలాగ లేదు.

"మీరు వెళ్ళవచ్చును..."

ప్రియంవద లేచి నిలబడి వెళ్ళిపోయింది.

సిగరెట్

ఎర్రటి సెకండ్స్ హేండ్ పదిమీద...పదకొండు, పన్నెండు...మీద.

గోపాలరావు సిగరెట్ వెలిగించబోతూంటే...ప్యూన్ వచ్చాడు.

"ఇంకా ఇద్దరున్నారండీ?"

"యూ వైట్"

సిగరెట్ కింగ్ సైజు. ఫిల్టర్. మేఘాల్లాటి పొంగు.

సుఖం

ఆనందం

అనుభూతి

గోపాలరావు ఆలోచనలు వాటిలో కలిసిపోయాయి. సిగరెట్ కాల్చడం ముగిసేదాకా అతను మరో ప్రపంచంలో ఉన్నాడు. ఆ తరవాత

రెండో కాండిడేట్

అతను లోపలికి అడుగుపెడుతూనే వొంగి నమస్కరించాడు.

"సిట్ డౌన్"

"థాంక్యూ సర్"

పది సంవత్సరాలక్రిందట సరిగ్గా ఇలాగే, పూర్తిగా ఇలాగే తాను ఒక గుమాస్తా పోస్టుకి ఇంటర్వ్యూకి వెళ్లడం జ్ఞాపకం వొచ్చింది గోపాలరావుకి.

అప్పుడు తానూ సరిగ్గా ఇలాగే ఉండేవాడు. కాకపోతే చొక్కాకి భుజంమీద చిరుగు ఉండేది...

"మీ పేరు?"

"వెంకటరావు..."

నిటార్గా కూర్చున్నాడు వెంకటరావు. ఆనాడు తానూ ఇలాగే..."

"ఏం చదివారు?"

"ఇంటరు పాసయ్యాను"

అదీ సరిగ్గా తనలాగే!

"ఏక్లాసులో?"

"ఫస్ట్..."

తాను సెకండ్‌లో పాసయ్యాడు.

"గ్రూపు?"

"మాథ్స్-ఫిజిక్స్, కెమిస్ట్రీ"

సరీగా తనలాగే.

"పైని ఎందుకు చదవలేదు?"

"ఆర్థిక స్తోమత లేక-అండి"

సరీగా అదే భాషలో, అదే గొంతుకలో-పది సంవత్స రాలు క్రితం తాను జవాబిచ్చేడు అదే ప్రశ్నకి.

"హాబీ?"

ఆనాడు అదే ప్రశ్న అడిగారు...

"నలభై కొడతాను పార్ట్ హేండులో నూరు" సరీగా తనలాగే...

వెంకట్రావుకి తల్లి తండ్రీ లేరు, మేనమామ దగ్గర పెంపకం. అతను స్కూలు మాస్టరు.

పదేళ్ల కిందట సరీగా తనలాగే నూటికి నూరు.

"మంచి పుస్తకం ఏదైనా చదివారా?"

తనకి వేసిన ప్రశ్న. జవాబు.

"చదివాను" "ఏమిటది?"

ఊపిరి బిగబట్టి జవాబుకోసం ఎదురు చూశాడు గోపాల రావు.

"టేల్ ఆఫ్ టూ సిటీస్..."

భగవాన్! అనుకున్నాడు గోపాలరావు—సరిగా తన జవాబు...

"దాన్ని గురించి చెప్పండి—

చక్కటి ఇంగ్లీషులో చెప్పడం ప్రారంభించాడు వెంకట రావు. కాని గోపాలరావదేమి వినడంలేదు. పదేళ్లకిందట జరిగిన తన ఇంటర్వ్యూ. తరవాత అన్నీ అతనికి అప్పుడు జరుగు తున్నట్టు జ్ఞాపకం వొచ్చాయి.

పది నిమిషాలు తన జవాబువిని, తనని ఇంటర్వ్యూ చేస్తున్న అతను పేరు మరిచిపోయాడు.

"మిస్టర్ గోపాలరావ్! ఈ చిన్న ఉద్యోగంలో చేరి జీవితం ఎందుకు పాడుచేసుకుంటారు? ఎలాగైనా బి. ఏ. పాసవండి. చాలా పెద్ద ఉద్యోగం దొరుకుతుంది" అన్నాడు.

"కాని...అని ఆ ఉద్యోగం తనకెంత అత్యవసరమో చెప్పబోయాడు గోపాలరావు. కాని "సారీ...ఇంక మీనించి ఏమీ వినదలచుకోలేదు." అని ఆయన తనని బయటికి పంపే శాడు.

తరవాత నానాబాధలు పడి బి. ఏ. పాసయాడు తాను. ఆ తరవాత ఉద్యోగానికి ప్రయత్నించి, ఈ కంపెనీలో అసి

స్టెంటు మేనేజరుగా చేరాడు...పదేళ్ళలో రెండుసార్లు అతనికి ప్రమోషను వొచ్చింది. సర్వీసులో చేరగానే ఆ కంపెనీలో ఒక డైరెక్టరుగారి అమ్మాయిని పెళ్ళి చేసుకోవడం దీనికి కారణం అని కొంతమంది అనడం అతనికి తెలిసినా, గోపాలరావుకి తన శక్తిసామర్థ్యాలమీద విశ్వాసం తగ్గలేదు.

అప్పుడు ఆ గుమస్తా ఉద్యోగంలో చేరిఉంటే ఈనాడు...

వెంకట్రావు మాట్లాడ్డంలేదు—జవాబు ముగిసినట్టుంది.

ఒక నిమిషం ఆలోచించి, "ఈ ఉద్యోగం మీకు కాదు మిస్టర్ వెంకట్రావ్!" అన్నాడు గోపాలరావు గంభీరంగా.

"సార్..."

"సారీ—మీకు ఉజ్జ్వలమైన భవిష్యత్ ఉంది...ఎలాగైనా బి. ఎ. పాసవండి..."

"కాని..."

"మరేమీ వినదలచుకోలేదు...గుడ్ బై..."

నీరసంగా వెళ్ళాడు వెంకట్రావు.

గోపాలరావు సంతృప్తిగా నిట్టూర్చాడు—ఒక మంచి పని చేసిన సంతృప్తి.

తరువాత కేండిడేటు ఎవరో అతనికి బాగా తెలుసు. శ్రీమతి ఉదయం వివులంగా తెలియజేసింది. ఆ ఇంటర్వ్యూ రెండు నిమిషాల్లో ముగించవచ్చు చాలా డిజర్వింగ్...

గోపాలరావు ప్యూను కోసం బెల్ బటన్ నొక్కాడు. ఇదీ ముగిస్తే మిగిలిన ఫైల్సు చూడవొచ్చును.

తరవాతి సిగరెట్‌కి ఇంకా నలభై ఒక్క నిమిషాలు ఆలశ్యం ఉంది. శ్రీమతిని మోసంచేసే ఉద్దేశం అతనికి రాలేదు.

తరువాతి కేండిడేట్ లోపలికి వొస్తున్నాడు. మొదటి రెండు నిమిషాల్లోనే అతనికి టైపుగాని, షార్ట్‌హేండ్‌గాని, ఇంగ్లీషుకాని బాగా రాదని తెలిసిపోయింది గోపాలరావుకి.

వెంకట్రావు తుణికంగా జ్ఞాపకం వొచ్చాడు.

వెనువెంటనే శ్రీమతి జ్ఞాపకం వొచ్చింది.

"ఒకరోజు వెంకట్రావుకి పెద్ద ఉద్యోగం దొరికి తీరుతుంది" అని తనని తానే నిశ్చయంగా చెప్పి, కాండిడేటుని ఇంకే ప్రశ్న అడగడం అని ఆలోచించసాగాడు గోపాలరావు.

గడియారం అదే వేగంతో సాగుతోంది!